# ★ ఆకలి ★

[కృష్ణ]

అది సెకండుక్లాసు కంపార్టుమెంటు. నేను అప్పుడే కొన్న న్యూస్‌పేపర్ తీసి చదువుతున్నాను. ఆ పెట్టెలో ఎవరున్నారోకూడ నేను గమనించలేదు. నేను చదువుతూచదువుతూ ఒకసారి కంపార్టుమెంటు అంతా చూసేను. ఒకచోట ఒక ముసలాయన, భార్య, ఇద్దరు పిల్లలు కూర్చున్నారు. మరొక 'బెర్త్'లో ఒక స్త్రీ కూర్చోనుంది. ఆమె అందాన్ని చూసి ముగ్ధుడనైపోయాను. ఆమె ఎంతసేపయిందో గాని నావేపు తదేకదీక్షతో చూస్తున్నాది. నేనూ ఆమెవేపు చూసేను. ఆమెఇంకా నావేపే చూస్తున్నాది. వెంటనే నాచూపు ఆపక్కనుండి మరలించి మళ్ళా పేపర్ చదవడం ప్రారంభించాను. అలా చదువుతుండగానే చిన్న నిద్రపట్టిపోయింది.

నేను నిద్రలేచి చూసేసరికి కంపార్టుమెంటు అంతా ఖాళీఅయిపోయింది. ఆమె ఒఖ్ఖర్తె మాత్రం తన సీటులో అలాకూర్చోనుంది. ఈసారి కూడ నావేపే చూస్తున్నట్టు అనపించింది. నేను ఆమె సంగతి కనుక్కుందామని లేచి "ఎక్కడికండి వెళ్తున్నారు?" అని ప్రశ్నించాను. ఆమె నావైపు అదోమాదిరిగా చూస్తూ "మెడ్రాస్ వెళ్తున్నాను" అని జవాబిచ్చింది. ఆ శ్రావ్యమైన కంఠం ఇంకా వినాలనే కుతూహలం కలిగింది. జవాబిచ్చేటప్పుడు చూపించే ఆ వొయ్యారము ఇంకా చూడాలనే అనిపించింది. అందుకని ఆమెతో ఇలా సంభాషణ ప్రారంభించాను.

"మెడ్రాస్‌లో మీకేమైనా పనున్నాది అనుకుంటాను."

"అవును. మావూళ్లో ఇంటరు పూర్తిచేసాను. అక్కడ బి.ఏ., లేదు. నాకు ఇంకా చదవాలనే వుంది. అందుకని వెళ్తున్నాను."

"ఇదే మీరు మొదటిసారి మెడ్రాస్ వెళ్లడం కాబోలు."

"ఇంతకుముందనేకసార్లు వెళ్ళానులెండి. మానాన్నగారు సాధారణంగా వెళ్తూవుంటారు. అప్పుడు నేనుకూడ వారివెంట వెళ్తూవుండేదాన్ని. అని అంటూ నాదగ్గరగా జరగడం ఆరంభించింది. ఆమె అంత పరిచయమున్నవాళ్ళలాగ మాట్లాడడము, మాట్లాడేప్పుడు ఆమెలక్షణాలు నాకు ఆశ్చర్యం కలిగించాయ్. సంసారస్త్రీ అయివుండి ఈ వేశ్య లక్షణాలు ఆమెకెలావచ్చాయా అని ఆలోచిస్తుండగా ఆమె మరింత దగ్గరగావచ్చి "ఆపేపర్ ఒకసారి ఇలాఇస్తారా? అనిఅడుగుతూ నేను ఇవ్వకుండానే నాచేతిలోంచి తీసుకొంది. అలా తీసుకొనేటప్పుడు ఆమె నాపక్క అదోమాదిరిగా చూసింది. ఆచూపు నామనస్సుని కలవరించింది. ఆమె వింత చేష్టలుచూసిచూసి చకితుడయ్యాను.ఆమెతల్లితండ్రుల సంగతి తెలుసుకుందామని ఇలా అడిగేను. "మీనాన్నగార్కి ఏదేనా వుద్యోగమా?" ఆమె అంతసేపటినుంచి నాదగ్గరగానే కూర్చోనుంది. "లేదండీ. మానాన్నగార్కి భూములున్నాయ్. వాటివల్ల వచ్చేఫలసాయం సుమారు సంవత్సరంపొడుగునా సరిపోగా ఇంతో అంతో మిగులుతుంది" అని జవాబిస్తూ నావంటికి తనవళ్లు తగిలిస్తూ కూర్చుంది. కొంతసేపు ఎవళ్లము మాట్లాడలేదు. ఆమె తిరిగి ఇలా ప్రశ్నించింది. "మీకు పెళ్ళయిందా?" నేను ఆమెకళ్ళల్లోకిచూస్తూ లేదని జవాబిచ్చాను. "మంచి రూపం, యౌవనంవుండి మీకింకా పెళ్ళికాలేదంటే నాకాశ్చర్యంవేస్తున్నాది. మీఅందాన్నిచూసి ఎవరేనా పిల్లనివ్వడానికి సిద్ధపడతారు." అని అంటూ ఆమె నావడిలో కూర్చుంది. నావంట్లో అప్పుడు చలనంలేదు. మంత్రముగ్ధుడనై ఆమెవేపు చూస్తున్నాను. ఆమె నాచేతులతో తన చేతులు కలిపి "మీకు మెడ్రాస్‌లో ఏదేనా వుద్యోగమా?" అని ప్రశ్నించింది. నానోటినుండి మాటరాలేదు. నాకు తెలియకుండానే "లేదు" అక్కడ ఒక స్టూడియోకి భాగస్వామిని. రేపు అక్కడ ఏదో మీటింగువుందని ప్రొప్రైటరు నన్ను రమ్మన్నాడు. అందుకని వెళ్తు

న్నాను అని చెప్పేను. "అయితే నన్ను ఏదేనా సినీమాలో తీసుకోండి. మీరు నాయకుని వేషం వెయ్యండి. నేను నాయకురాలిని" అని అంది నవ్వుతూ. ఆమెమాటలకి చేష్టలకి ఆశ్చర్యపోయాను. వెర్రివాడిలాగ ఆమెవేపు అలా చూస్తున్నాను. ఏమండీ మాట్లాడరు. నేను వేషంవెయ్యడం మీకిష్టం లేదు కాబోలు. మనిద్దరం వేషంవేస్తే ఇలా ఒకరినొకరు కౌగిలించుకోవచ్చు అనిఅంటూ నాగుండెలు మీద వాలిపోయింది. నేను ఆమె తల నిమురుతూ అప్రయత్నంగా ఆమెను ముద్దుపెట్టుకున్నాను—

మెడ్రాస్‌లో నాబసలోకే ఆమెను తీసుకొచ్చాను. అక్కడ నాస్నేహితులందరూ 'ఏమిరోయ్, ఏన్నాళ్లయింది. టీపార్టీ ఎప్పుడు. అని పలకరించేవారు. నేను జవాబుచెప్పకుండా వూరుకునేవాణ్ణి. ఆమర్నాడు నేను మామూలుగా స్టూడియోకి తిరిగి నాబసకి వచ్చేసరికి ఆమె అక్కడలేదు. గదితలుపు తీసేవుంది. లోపలికి వెళ్ళిచూసేసరికి అక్కడ కూడ ఆమె కనపడలేదు. నా సూటుకేసు మాత్రం తెరిచేవుంది. నాకు భయంవేసింది. గబగబా వెళ్ళి అందులోవున్న పర్సుకోసం వెదికాను. ఎక్కడా కనుపించలేదు. వళ్లు గజగజ వణికింది. గుండె దడదడ కొట్టుకొనసాగింది. ఏమిచెయ్యడానికి తోచలేదు. అప్పుడు అక్కడ ఒక చీటి కనుపించింది. అందులో ఇలావుంది. "నీబోటివాళ్లమూలాన్న మాలాంటి అనాధస్త్రీలకి ఇంత భుక్తిలభిస్తున్నాది. నీలాంటి అమాయకులను మోసం చెయ్యడం మాకిష్టంలేదు కాని 'ఆకలి' చేత నీలాంటివాళ్ళను కూడ మోసగించవలసివచ్చింది. ఈ 500 రూపాయలు నీబోటి ధనవంతులకొక లెఖ్ఖకాదు. మాబోటివాళ్ళకిస్తే ఎంతేనా పుణ్యం. మోసగించినందులకు క్షమించవలెను. ఇట్లు ఒక 'అనాధస్త్రీ'.

ఆవుత్తరం చూసి అలా నిశ్చేష్టుడనైపోయాను.

వైద్యరత్న.
పండిత.డి.గోపాలాచార్యులవారి.
జీవామృతము
కండపుష్టికి,
వీర్యవృద్ధికి,
జవసత్వములకు
ప్రసిద్ధిగాంచిన
వాజీకరరసాయనము.
ఆయుర్వేదాశ్రమము., మద్రాసు.